క్లుప్తంగా

ఆస్తిపన్ను వసూలు వేగవంతం కావాలి

తిరువూరు: నిర్దేశిత లక్ష్యాల మేరకు ఆస్తి పన్ను వసూళ్లు వేగవంతం చేయాలని తిరువూరు నగర పంచాయతీ కమిషనర్ బాలకృష్ణ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. తిరువూరు పట్టణంలోని ఆరో సచివాలయాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు కనిపించే విధంగా ప్రదర్శించాలని, ఆస్తిపన్ను, యూజర్ చార్జీల పన్నులను త్వరితగతిన వసూలు చేయాలని ఆదేశించారు.

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ శిబిరాలు

తిరువూరురూరల్: మండలంలోని నాలుగు గ్రామాల్లో బుధవారం నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఇన్చార్జి ఎంపీడీవో నాగేశ్వరరావు తెలిపారు. 20, 21 తేదీల్లో అక్కపాలెం, చౌటపల్లి, 22, 23 తేదీల్లో వావిలాల, జి.కొత్తూరు గ్రామాల్లో నిర్వహించే క్యాంపులలో ఆధార్ డేటా నవీనీకరణ, సవరణ, కొత్త ఆధార్ కార్డుల జారీ తదితర కార్యకలాపాలు నిర్వహించవచ్చని తెలిపారు. ఆయా గ్రామాల్లోని సచివాలయాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ క్యాంపులు జరుగుతాయన్నారు.

కొనసాగుతున్న ఎమ్మార్పీఎస్ నిరసన దీక్ష

గంపలగూడెం: ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ ప్రత్యేక సమావేశంలో చట్టబద్ధత కల్పించాలని కోరుతూ గంపలగూడెంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్ష మూడో రోజు మంగళవారం కొనసాగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మాదిగలకు ఇచ్చిన మాటకు కట్టుబడి వర్గీకరణ చేసి ఆ వర్గం అభివృద్ధికి దోహదపడాలని కోరారు. నాయకులు నాగమల్లేశ్వరరావు, మైఖేల్, రత్నం తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా నగదు అందజేత



విస్సన్నపేట: మండలంలోని కొండపర్వ గ్రామానికి చెందిన ముటం శ్రీనివాసరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా పథకం కింద మట్టి ఖర్చుల నిమిత్తం రూ. 10వేల నగదు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జి. రమేష్‌బాబు, వైస్ ఎంపీపీ గాజుల శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షుడు చంద్రశేఖరరావు, సచివాలయ కన్వీనర్ మంగయ్య, సచివాలయ సిబ్బంది చేతుల మీదుగా నగదు అందజేశారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం



గంపలగూడెం: చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడం ద్వారా ఆరోగ్యం చేకూరుతుందని అంగన్‌వాడీ కార్యకర్తలు సూచించారు. గంపలగూడెం-65 అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పౌష్టికాహారం మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పౌష్టికాహారం, చిరుధాన్యాల స్టాల్‌ను ప్రదర్శించారు. ఎంతో శ్రేష్టమైన తల్లిపాలను బిడ్డలకు తప్పకుండా పట్టాలని సూచించారు. కిశోర బాలికలు రక్తహీనతకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు కస్తూరి, స్రవంతి, నాగమణి, పద్మావతి, హసీనా తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా 'ఆరోగ్య సురక్ష' సర్వే

నూజివీడు: పట్టణంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, వలంటీర్లు కలిసి ముమ్మరంగా సర్వే చేస్తున్నారు. ఈనెల 16 నుంచి గృహాలను సందర్శించి అనారోగ్యంతో బాధపడేవారి వివరాలను సేకరిస్తున్నారు. సుగర్, బీపీలతో పాటు ఇతర వ్యాధులతో బాధపడుతున్నారా?, అనారోగ్యంతో ఉన్నారా? అనే వివరాలను యాప్‌లో నమోదు చేస్తున్నారు. అవసరమైన వారికి రక్త పరీక్షలు చేసి ఫలితాలను తెలియజేస్తున్నారు. ఈనెల 29 వరకు ఈ సర్వే నిర్వహించి, అనంతరం పలు ప్రాంతాల్లో వైద్య శిబిరాలను నిర్వహించి చికిత్స అందజేయనున్నారు.

ఆంజనేయ స్వామి ఆలయంలో అన్నదానం

చాట్రాయి: మండలంలోని సూరంపాలెం అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో ఏపీ కో ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం అన్నదానం చేశారు. ఉదయం ఆలయంలో ఆయన కుటుంబ సమేతంగా, అల్లుడు అల్లు ఉదయ భాస్కర్‌రెడ్డి కూతురు సత్యవేణి పూజలు చేశారు. ఈ సందర్భంగా 800 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు చెలికాని బాబ్జి, కారంగుల వాసు తదితరులు పాల్గొన్నారు.

నమో గణాధిప



కొండపల్లిలో ప్రత్యేక పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



నూజివీడు ముసలి రామమందిరం వద్ద గణపతిని దర్శించుకుంటున్న భక్తులు



గాంధీ సెంటర్‌లో సామూహిక కుంకుమార్చన..



ఇందిరాకాలనీలో ప్రత్యేక పూజలు..



వట్టిగుడిపాడులో తొలి పూజ..



బూరుగుగూడెంలో పూజ చేస్తున్న దేశిరెడ్డి

వాడవాడలా ఘనంగా వినాయక చవితి

గంపలగూడెం: వినాయక చవితి పర్వదినాన్ని సోమవారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. గంపలగూడెం గాంధీసెంటర్, కాపులవీధి, రెడ్డిబజారు, పటమట దళితవాడ, తోటమూల వై-జంక్షన్, పొంద్రీసెంటర్‌లో, పెనుగొలను, ఊటుకూరు, కొణిజెర్ల, నెమలి, గోసవీడు, వినగడప, తునికిపాడు, అనుముల్లంక, కనుమూరు తదితర గ్రామాల్లో ప్రధాన కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన నవరాత్రి శిబిరాల్లో భారీ వినాయక విగ్రహాలను నెలకొల్పారు. మహిళలచే సామూహిక కుంకుమార్చన నిర్వహించారు.

వినాయకుడికి ప్రత్యేక పూజలు

ఎ.కొండూరు: మండలంలోని చీమలపాడు, ఎ.కొండూరు, కంభంపాడు, రామచంద్రాపురం, కృష్ణారావుపాలెం, గొల్లమందల, పోలిశెట్టిపాడు, వల్లంపట్ల పలుగ్రామాల్లో వినాయక చవితి పండుగను సోమవారం జరుపుకున్నారు. వివిధ గ్రామాలలో పలు కూడళ్ల వద్ద ప్రత్యేక పందిళ్లు ఏర్పాటు చేసి గణనాధుని విగ్రహాలను నెలకొల్పారు.

గణపతి నవరాత్రులు ప్రారంభం

నూజివీడు(ఆగిరిపల్లి): ఆగిరిపల్లి మండలంలోని గ్రామాల్లో గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రజలు వైభవంగా నిర్వహించుకుంటున్నారు. గ్రామాల్లోని ప్రధాన సెంటర్లు, కూడళ్లలో గణేష్ విగ్రహాలను ఏర్పాటు చేసుకొని రెండు పూటలా పూజలు చేస్తున్నారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరిస్తున్నారు. మండలంలోని పలు గణపతి విగ్రహాల మండపాలను నూజివీడు రూరల్ సీఐ ఆర్. అంకబాబు, ఎస్ఐ నంబూరు చంటిబాబు సందర్శించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.

మైలవరంలో చవితి సంబరాలు

మైలవరం: వినాయక చవితి వేడుకలను మైలవరంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. మైలవరం నూజివీడు రోడ్డులోని శ్రీలక్ష్మీ గణపతి దేవాలయం, కోట వెనుక కోట మహాలక్ష్మీ అమ్మవారి ఆలయం, రాజాపేటలో చలువ పందిళ్లు వేసి వినాయకుని విగ్రహాలు ఏర్పాటు చేశారు. మైలవరంలోని పంచాయతీ కూడలి, సంఘమిత్ర థియేటర్ కాంప్లెక్స్ వద్ద మట్టి ప్రతిమలను దాతలు ఉచితంగా పంపిణీ చేశారు. వెల్వడం గ్రామంలో కూడా వేడుకలు జరిగాయి.



మైలవరంలో ఏర్పాటు చేసిన విగ్రహం

ఘనంగా వినాయక చవితి

తిరువూరు: వినాయక చవితి పర్వదినాన్ని పట్టణంలో భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కుమ్మరి బజారు శ్రీవిఘ్నేశ్వరాలయం, బైపాస్ రోడ్డులోని శ్రీలక్ష్మీ గణపతి ఆలయం, రాజుపేట శ్రీఅష్టలక్ష్మి ఆలయం, శ్రీషిర్డీ సాయి మందిరాలలో గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా జరిగిన ప్రత్యేక పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పాత ఏడీబీ సెంటర్, జైబావి సెంటర్, లక్ష్మి సెంటర్, గణేష్ సెంటర్, బోస్ సెంటర్, కేడీసీసీ బ్యాంక్, జగన్నాథపురం కాలనీ, ఇందిరాకాలనీ, పాతతిరువూరులలో గణపతి నవరాత్రి వేడుకలు నిర్వహిస్తున్నారు.



కాట్రేనిపాడులో పూజలు చేస్తున్న ఎంపీపీ దంపతులు

ఘనంగా వినాయక చతుర్థి

ఇబ్రహీంపట్నం: వినాయక చతుర్థి వేడుకలు మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం ఘనంగా జరిపారు. చలువ పందిళ్లలో వివిధ ఆకృతుల్లో వినాయక ప్రతిమలు ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. కొన్ని గ్రామాల్లో తొమ్మిది రోజులు వేడుకలు జరిపేందుకు ఏర్పాట్లు చేశారు. కొంతమంది తొలిరోజే స్వామివారిని ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. కొండపల్లి, ఇబ్రహీంపట్నం, గుంటుపల్లి తదితర గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు పూజల్లో పాల్గొన్నారు.

వాడవాడలా కొలువుదీరిన గణనాథులు

ముసునూరు: మండల వ్యాప్తంగా ఏర్పాటు చేసిన నవరాత్రి పందిళ్లలో గణనాథులు సోమవారం కొలువుదీరారు. కాట్రేనిపాడు శివారు రంగన్నపాలెంలో ఏర్పాటు చేసిన మండపంలో ఎంపీపీ ఆర్ కృష్ణకుమారి సుబ్బారావు దంపతులు, లోపూడి, గోపవరంలలో వైస్ ఎంపీపీలు రాజానాయన, గంగాధర్ ప్రత్యేక పూజలు చేశారు. హరిశ్చంద్రపురంలో 11 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేసి, 12 కేజీల లడ్డూను, చెక్కపల్లి సెంటర్‌లోని షిర్డీ సాయిబాబా మందిరం వద్ద ఆరడుగుల గణనాథుని చేతిలో 20 కేజీల లడ్డూను పెట్టారు.

చాట్రాయిలో చవితి వేడుక

చాట్రాయి: మండలంలో వినాయక చవితి పండుగను సోమవారం ఘనంగా నిర్వహించారు. బూరుగుగూడెంలో ఏపీ కో ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి దంపతులు పూజలు చేశారు.

దండాలయ్యా.. ఉండ్రాళ్లయ్యా..

నూజివీడు: స్థానిక పండ్లమార్కెట్ సెంటర్, ఎంప్లాయిస్ కాలనీ, శివాలయం సెంటరు, రామాయమ్మరావుపేటలోని ఆంజనేయస్వామి గుడి, మొఘల్ చెరువు ప్రాంతాల్లో, నాగవిఘ్నేశ్వరాలయం, కొప్పెలమపేట, గాంధీనగర్, శ్రీనివాససెంటర్, ఎమ్మార్‌అప్పారావు కాలనీ, గొడుగువారిగూడెం, ఢంఢం గార్డెన్ రోడ్డు, కోనేరుపేట టీటీడీ కల్యాణమండపం, సమతానగర్, విస్సన్నపేట బస్టాప్, విస్సన్నపేట రోడ్డు, శివాలయం వద్ద, నందనంతోట, మైలవరం అప్పారావు షెడ్డు, ముసలి రామమందరం తదితర ప్రాంతాల్లో గణపతి విగ్రహాలను ఏర్పాటు చేసి, భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

ఇంటింటికీ కుళాయి ఏర్పాటు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి మునిసిపాలిటీ ఏడోవార్డు న్యూఆర్పీఎం కాలనీలో ఇంటింటి తాగునీటి పథకంతో సమృద్ధిగా తాగునీరు అందుతుందని ఆ వార్డు కౌన్సిలర్ కుమ్మరి నాగసుధ, శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు రూ.40లక్షలతో 350కి పైగా కుటుంబాలకు ఇంటింటికీ కుళాయి అమర్చామన్నారు. పాత ఆర్పీఎం కాలనీలో రూ.10లక్షల వ్యయంతో ఇంటింటి కుళాయి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు. త్వరలో పనులు పూర్తిచేసి పుష్కలంగా నీరు అందిస్తామన్నారు. ఆర్పీఎం కాలనీల్లో ప్రజల కోరిక మేరకు తాగునీటి సమస్య నివారణకు కృషి చేసిన ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

రసాయన శాస్త్రంపై అవగాహన అవసరం

మైలవరం: విద్యార్థులు రసాయన శాస్త్రంపై అవగాహన కలిగి ఉండాలని అధ్యాపకుడు డాక్టర్ వి. ఫణికుమార్ తెలిపారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల డిపార్ట్‌మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ ఆధ్వర్యంలో ల్యాబ్ టు స్కూల్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. డాక్టర్ ఫణికుమార్ ఆధ్వర్యంలో కళాశాల బీఎస్సీ హార్టీకల్చర్ విద్యార్థినులతో స్థానిక జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్‌లో రసాయన శాస్త్రంపై అవగాహన కల్పించారు. డాక్టర్ ఫణికుమార్ మాట్లాడుతూ నిత్య జీవితంలో జరిగే రసాయన చర్యలు వివరించారు. కార్యక్రమాన్ని హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు పి. లక్ష్మీ, ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయురాలు ఎం. తులసి పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): కేతనకొండ గ్రేస్ మినిస్ట్రీస్ చర్చి ఆధ్వర్యంలో పేదలకు ఉచిత వైద్యశిబిరం మంగళవారం నిర్వహించారు. శిబిరంలో అనారోగ్యంతో బాధపడుతున్న వారికి మధుమేహం, బీపీ పరీక్షలు చేశారు. డాక్టర్ స్వేత, రాజారత్నం వైద్య వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. రోడ్డు పక్కన నిస్సహాయులుగా ఉన్న వారికి ఆరోగ్య పరీక్షలు జరిపి మందులు అందజేశారు. అమెరికా నుంచి వచ్చిన బ్రదర్ నాథన్, లిండ్సే వైద్య శిబిరాన్ని పర్యవేక్షించారు. మానవసేవా మాధవ సేవగా భావించాలన్నారు. కార్యదర్శి సుమలత, అబ్రహాం, రమేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆటల పోటీలతో సంపూర్ణ వికాసం సాధ్యం

నూజివీడు: ఆటలపోటీల ద్వారా విద్యార్థుల్లో పోటీతత్వం, పట్టుదల, ఐక్యమత్యం, మానసిక, శారీరక దారుఢ్యం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని డీవైఈఓ ఎం. సేవియా అన్నారు. స్థానిక ధర్మ అప్పారావు కళాశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నియోజకవర్గస్థాయి జూనియర్, సీనియర్ విభాగాల్లో పలు ఆటల పోటీలను నిర్వహించారు. వీటిని ప్రారంభించిన సేవియా మాట్లాడుతూ ప్రతి పాఠశాల నుంచి విద్యార్థులు ఆటల పోటీల్లో పాల్గొనేలా పీడీలు శిక్షణ నివ్వాలన్నారు. చదువుతో పాటు ఆటల్లో కూడా విద్యార్థులు రాణించాలని సూచించారు. అనంతరం అథ్లెటిక్స్ విభాగంలో 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్లు, 800 మీటర్లు, 1,500 మీటర్లు, మూడు వేల మీటర్ల పరుగు పందెం, హైజంప్, లాంగ్‌జంప్, షార్ట్‌పుట్, జావెలిన్ త్రో, డిస్కస్ త్రో ఈవెంట్లను నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన క్రీడాకారులు త్వరలో జిల్లా స్థాయిలో నిర్వహించే పోటీల్లో పాల్గొననున్నారు. వ్యాయామోపాధ్యాయులు పి.రవీంద్ర, సుకుమార్, రాజేంద్రప్రసాద్, వాకా నాగరాజు, సతీష్, ప్రభాకర్ తదతరులు పాల్గొన్నారు.



బాలికల పరుగుపందెను ప్రారంభిస్తున్న డీవైఈఓ సేవియా

అభాగ్యులకు సేవలందించడంలోనే సంతృప్తి

ఊటుకూరు(గంపలగూడెం): పేదలు, అభాగ్యుల, అనాథలకు సేవలందించడం ద్వారా ప్రతి ఒక్కరూ తమ జీవితాన్ని సార్థకం చేసుకోవాలని వాసవీ క్లబ్ జిల్లా గవర్నర్ మిత్తింటి శారద అన్నారు. గంపలగూడెం మండలం ఊటుకూరులో మంగళవారం జిల్లా గవర్నర్ పర్యటన కొనసాగింది. ముందుగా స్థానిక వాసవీక్లబ్, వనిత, కన్యకా క్లబ్బుల రికార్డులను సేవా కార్యక్రమాలను పరిశీలించి ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. మూడు క్లబ్‌ల ఆధ్వర్యంలో ముత్యాలమ్మ గుడి, గాంధీ సెంటర్లో, బస్టాప్ సెంటర్లలో ఏర్పాటు చేసిన ఆరు సిమెంట్ బల్లలను ఆమె ప్రారంభించారు. అంగన్ వాడీ కేంద్రానికి అవసరమైన టేబుల్‌ను వితరణగా అందజేశారు. పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం గో సేవా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో జరిపారు. వాసవీ క్లబ్ జిల్లా ఇన్‌చార్జి వేముల ప్రకాష్ బాబ్జి, జోన్ చైర్ పర్సన్ కాజా శ్రీనివాసరావు, మూడు క్లబ్బుల అధ్యక్షుడు నేరెళ్ల శేషగిరిరావు, మైలవరపు శ్రీ రమ్య, నేరెళ్ల రోశయ్య పాల్గొన్నారు.



ఊటుకూరు అంగన్ వాడీ కేంద్రానికి టేబుల్‌ను అందజేస్తున్న శారద

ఘనంగా రక్షణ సైన్యం ఆవిర్భావ దినోత్సవం



ముసునూరు: ప్రజలను ప్రేమ, శాంతి, రక్షణ మార్గాల్లో నడిపేందుకే రక్షణ సైన్యం సంస్థను ప్రారంభించినట్టు పాస్టర్ కెప్టెన్ ఎం.రాజు పేర్కొన్నారు. మండల కేంద్రం ముసునూరుతోపాటు కాట్రేనిపాడు, గోపవరం, పెదపాటివారిగూడెం, వేల్పుచర్లల్లోని రక్షణసైన్యం చర్చిల వద్ద మంగళవారం సంస్థ భారతదేశ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముసునూరులో పాస్టర్ రాజు దంపతులు సంఘ సభ్యులతో కలిసి సంస్థ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో ఆయా చర్చిల పెద్దలు, సంఘ విశ్వాసులు పాల్గొన్నారు.

నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

నూజివీడు: పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను విద్యార్థులు కలిగి ఉంటేనే చదువు పూర్తికాగానే ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ నూజివీడు మ్యాంగోటౌన్ అధ్యక్షురాలు కొడాలి అరుణ అన్నారు. స్థానిక శ్రీ సిద్ధార్థ డిగ్రీ కళాశాలలో ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ నూజివీడు మ్యాంగో టౌన్, నాంది ఫౌండేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో ఐదురోజుల నైపుణ్యాభివృద్ధి శిక్షణ మంగళవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ డిగ్రీ చదువు పూర్తయ్యేలోగా నైపుణ్యాలను సైతం పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి వై.విష్ణుప్రియ, నాంది ఫౌండేషన్ సభ్యురాలు యార్లగడ్డ శ్రీదేవి, కళాశాల డైరెక్టర్లు గొల్లపూడి రవిబాబు, తోటకూర సాంబశివరావు, ప్రిన్సిపాల్ ఎండీ ఇద్రీస్, శిక్షకులు జి.హరిబాబు, ఎన్ జీవన్‌కుమార్ పాల్గొన్నారు.

క్రీడలతో దేహదారుఢ్యం

- తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి
- నియోజవర్గస్థాయి ఆటల పోటీలు ప్రారంభం

గంపలగూడెం: క్రీడలతో దేహదారుఢ్యం, జ్ఞాపకశక్తి, చురుకుదనం పెరుగుతాయని, ఆటల్లో ప్రతిభ చూపిన వారికి ఉద్యోగావకాశాలు మెరుగ్గా ఉంటాయన్న విషయం విద్యార్థులు గ్రహించాలని తిరువూరు శాసనసభ్యుడు కొక్కిలిగడ్డ రక్షణనిధి తెలిపారు. గంపలగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన తిరువూరు నియోజకవర్గ స్థాయి బాలబాలిక అండర్-14, 17 ఆటలపోటీలను మంగళవారం ఆయన ప్రారంభించారు. ముందుగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విద్యకు ఎంతో ప్రాధాన్యం ఇచ్చి ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పిస్తోందన్నారు. ప్రైవేటు స్కూల్స్‌కు దీటుగా ప్రభుత్వ స్కూళ్లలో విద్యాబోధన సాగిస్తోందన్నారు. అదేవిధంగా పాఠశాలల్లో విద్యార్థులకు క్రీడల పట్ల ఆసక్తి కల్గించేలా వసతులు కల్పించి అనేక టోర్నమెంట్‌లను నిర్వహిస్తోందన్నారు. చదువుతోపాటు విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ జీవితాలకు బంగారుబాట వేసుకోవాలన్నారు. అనంతరం కబడ్డీ, వాలీబాల్, టెన్నికాయిట్, బాల్‌బ్యాడ్మింటన్, ఖో-ఖో, త్రోబాల్, యోగా, అథ్లెటిక్స్ కోర్టులను నాలుగు మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే కబడ్డీ, వాలీబాల్ ఆడి వారిని ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో గంపలగూడెం, తిరువూరు, విసన్నపేట ఎంపీపీలు గోగులమూడి శ్రీలక్ష్మి, గద్దల భారతి, పిల్లిమర్రి వనజాక్షి, జెడ్పీటీసీ సభ్యులు కె. శ్యామ్యూల్, వై. రామచంద్రారెడ్డి, లోకేశ్వరరెడ్డి, భూక్యా గనియా, తిరువూరు ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, గంపలగూడెం సర్పంచ్ కోట పుల్లమ్మ, మాజీ ఎంపీపీ కోట దాసు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చావా వెంకటేశ్వరరావు, నాయకులు చెరుకు నర్సారెడ్డి, జి. చెన్నకేశవరెడ్డి, బొల్లా కరుణాకరరావు, ఎంపీడీఓ వై. పిచ్చిరెడ్డి, ఎంఈఓ నరశింహరావు, ఇన్‌చార్జి హెచ్ఎం కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



గంపలగూడెం హైస్కూల్‌లో కబడ్డీ కోర్టు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి



విద్యార్థులతో కలిసి కబడ్డీ ఆడుతున్న ఎమ్మెల్యే రక్షణనిధి

రక్త హీనతను నిర్మూలిద్దాం



చాట్రాయి: యుక్త వయస్సులో ఉన్న బాలికల్లో రక్త హీనత రాకుండా తగిన చర్యలు తీసుకుందామని ఏలూరు జిల్లా సచివాలయాల శాఖ సామాజిక ప్రవర్తన మార్పు సమాచార విభాగం జిల్లా సమన్వయ కర్త టీఎన్ స్నేహన్ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని పోలవరం జెడ్పీ హైస్కూల్లో రక్తహీన నిర్మూలన, బాల్య వివాహాల నిరోధం అనే అంశంపై బాలికలకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. రక్త హీనతను పారదోలడానికి పోషక విలువలు గల ఆహారాన్ని తీసుకోవాలని స్నేహన్ సూచించారు.

సంక్షిప్త వార్తలు

వివాహితను వేధిస్తున్న వారిపై కేసు

నూజివీడు(ఆగిరిపల్లి): భర్త చనిపోయిన తరువాత తనపై మామ, బావ, మరిదిలు దౌర్జన్యం చేస్తూ, బెదిరింపులకు గురిచేస్తున్నారంటూ ఆగిరిపల్లి మండలం ఈదరకు చెందిన దారా స్వర్ణకుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ నంబూరు చంటిబాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. స్వర్ణకుమారి భర్త నాగభూషణం గతేడాది అక్టోబర్ 4న మృతిచెందాడు. అనంతరం మామ దారా వెంకటేశ్వరరావు, బావ నాగరాజు, మరిదిలు చంటిబాబు, సురేష్‌బాబు, తోటికోడళ్లు సుజాత, సుస్మితలు నాగభూషణంకు చెందిన ట్రాక్టర్, బైక్ దౌర్జన్యంగా లాక్కొన్నారు. ఈనెల 18న పాసుపుస్తకం ద్వారా సంక్రమించిన భూమిని సర్వేయర్‌తో కొలిపించడానికి పొలం వద్దకు వెళ్లిన స్వర్ణకుమారిని అడ్డుకున్నారు. ఆమెపై దుర్భషలాడి పొలం జోలికి వస్తే చంపుతామని బెదిరించి భయభ్రాంతులకు గురిచేశారు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించారు.

సిమెంట్ రోడ్డు పరిశీలన

రెడ్డిగూడెం: మండలంలోని శ్రీరామపురం గ్రామంలో జిల్లా పరిషత్ నిధుల నుంచి రూ. 4లక్షలతో ఏర్పాటు చేసిన సిమెంట్ రోడ్డును జెడ్పీటీసీ సభ్యుడు పాలంకి విజయభాస్కరరెడ్డి మంగళవారం పరిశీలించారు.

ఉపాధి కూలి కుటుంబానికి చెక్కు అందజేత

రెడ్డిగూడెం: ఉపాధి హామీ పథకంలో పనిచేస్తూ ఇటీవల గుండెపోటుతో మరణించిన కూలి గురిజాల అక్కమ్మకు మంజూరైన రూ. 50వేల చెక్కును కుటుంబ సభ్యులకు జెడ్పీటీసీ పాలంకి విజయభాస్కరరెడ్డి మంగళవారం అందజేశారు

సర్వే పరిశీలన..

రెడ్డిగూడెం: మండలంలోని మద్దులపర్వ గ్రామంలో జగనన్న ఆరోగ్యసురక్షలో భాగంగా ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని జెడ్పీటీసీ పాలంకి విజయభాస్కర రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ రూపాయి ఖర్చు లేకుండా మెరుగైన ఉచిత వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సురక్ష సర్వేను పకడ్బందీగా పూర్తి చేయాలన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

మైలవరం: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని మైలవరం మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జడ్జి ఎం. శైలజ తెలిపారు. మైలవరం కోర్టు ప్రాంగణంలో మంగళవారం మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. మైలవరం బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు పి. పద్మశ్రీ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రీడా పోటీలకు గుడిపాడు విద్యార్థులు

ముసునూరు: జిల్లా స్థాయి క్రీడా పోటీలకు తమ విద్యార్థినులు ఏడుగురు ఎంపికైనట్టు గుడిపాడు హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్ఎం జీఎస్ఎల్ నిర్మలాదేవి తెలిపారు. ఇటీవల ముసునూరు హైస్కూల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన నియోజకవర్గ స్థాయి ఎంపిక పోటీల్లో తమ పాఠశాల విద్యార్థినులు అండర్-14 ఖోఖో విభాగంలో భార్గవ్, వాలీబాల్ విభాగంలో ఝాన్సీ, శ్రావణి, అండర్-17 వాలీబాల్ విభాగంలో ఫరీజా, నాగదుర్గ, పల్లవి, అచ్యుత్ అసమాన ప్రతిభ కనపర్చి, ఉమ్మడి కృష్ణా జిల్లా వాలీబాల్, ఖోఖో తుది జట్లలో స్థానం సాధించినట్టు పేర్కొన్నారు. త్వరలో నిర్వహించే ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో నియోజకవర్గ జట్ల తరఫున వీరు ఆడనున్నట్టు వివరించారు.

కృత్రిమ అవయవాలతో సాధారణ జీవితం

నూజివీడు(ఆగిరిపల్లి): పుట్టుకతో లేదా ప్రమాదంలో శరీర అవయవాలను పోగొట్టుకున్న దివ్యాంగులు స్వచ్ఛంద సంస్థలు అందించే కృత్రిమ అవయవాల సాయంతో సాధారణ జీవితం కొనసాగించవచ్చని నూజివీడు సీడ్స్ అధినేత మండవ ఆశాప్రియ అన్నారు. ఆగిరిపల్లి మండలం తోటపల్లికి చెందిన ఎలిజబెత్ లెగసీ ఆఫ్ హోప్ హీల్ కృత్రిమ అవయవ కేంద్రం తరఫున తెలంగాణ రాష్ట్రం సిద్ధిపేట జిల్లాకు చెందిన ధరావత్ వరూధిని (8)కి కృత్రిమ కాలును ఆమె చేతుల మీదుగా మంగళవారం అందజేశారు. ఆశాప్రియతో పాటు సోదరుడు గవిర్నేని బాబు శ్రీకర్‌లు హీల్ ఆశ్రమం విద్యార్థులందరికీ అన్నదానం చేశారు. 10 మంది దివ్యాంగులకు కృత్రిమ కాళ్లకు ఆర్థిక సాయం అందించేందుకు హామీ ఇచ్చారు. హీల్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కోనేరు సత్యప్రసాద్, హీల్ డైరెక్టర్ మలినేని రంగప్రసాద్, సీఈఓ కూరపాటి అజయ్ కుమార్ పాల్గొన్నారు.



చిన్నారికి కృత్రిమ కాలును అందజేస్తున్న ఆశాప్రియ